## జీఎస్టీ వసూళ్లు 1.84 లక్షల కోట్లు




### గతంతో పోల్చితే ఫిబ్రవరిలో 9.1 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 1: జీఎస్టీ వసూళ్లు మరోసారి భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో రూ.1.84 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.68 లక్షల కోట్లతో పోలిస్తే 9.1 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది. దేశీయ వినిమయం పుంజుకోవడం, ఆర్థిక రంగం తిరిగి వృద్ధి బాట పట్టడం వల్లనే జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదవుతునాయని వెల్లడించింది. గత నెలలో వసూలైన రూ.1.84 లక్షల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.35,204 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,704 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.90,870 కోట్లు, పరిహారం సెస్ రూపంలో రూ.13,868 కోట్లు వచ్చాయని పేర్కొంది. జీఎస్టీ వసూళ్లలో దేశీయంగా వచ్చిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10.2 శాతం ఎగబాకి రూ.1.42 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను ద్వారా రూ.41,702 కోట్లు సమకూరాయి. అలాగే రూ.20,889 కోట్ల పన్నును రిఫండ్ రూపంలో చెల్లించింది. ప్రస్తుత సంవత్సరం తొలి నెల జనవరిలో రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. దీనిపై ఈవై ట్యాక్స్ పార్టనర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శణమని, అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితిలో ఉన్నప్పటికీ పన్ను వసూళ్లు ఇంచుమించు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషమన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లు 10 శాతం నుంచి 20 శాతం వరకు అధికమవగా, అలాగే తెలంగాణతోపాటు గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో 1 శాతం నుంచి 4 శాతం వరకు పెరిగాయి.

# టెస్లాపై ఆశలు వదులుకున్నట్టేనా?

### తీవ్రంగా పోటీపడుతున్న వివిధ రాష్ట్రాలు
### పట్టించుకోని తెలంగాణ సర్కారు
### టెస్లా కోసం గతంలో కృషిచేసిన కేటీఆర్


టెస్లా కారుతో కేటీఆర్ (ఫైల్)

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆ పెట్టుబడిని రాబట్టేందుకు పలు రాష్ట్రాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఉచిత భూములు, రకరకాల ప్రోత్సాహకాల ఆశ చూపడంతోపాటు తమ రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను ఎత్తిచూపుతూ ఎలాగైన పరిశ్రమను దక్కించుకొనేందుకు ఎవరి మార్గాల్లో వారు ప్రయత్నిస్తున్నారు. ఈ పోటీలో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందా? అంటే అవుననే సమధానం వస్తున్నది. టెస్లా ప్లాంటు కోసం రాష్ట్ర సర్కారు అవసరమైన మేరకు ప్రయత్నాలు చేయకపోవడమే ఈ వాదనలకు బలాన్ని చేకూర్చుతున్నది.

టెస్లా కంపెనీని ఆకర్షించేందుకు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, కర్ణాటక, తెలంగాణ సైతం రేసులో ఉన్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఇప్పటికే అనేక ఆటోమొబైల్ పరిశ్రమలు కొనసాగుతుండటం వాటికి కలిసొచ్చే అంశం. ఇప్పటికే పలు ప్రముఖ కార్ల తయారీ కంపెనీలు ఈ రాష్ట్రాల్లో తమ పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులు చేస్తున్నాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు ఐటీ పరిశ్రమలు అధికంగా ఉండటం కొంత అనుకూలాంశం కాగా, ఈ రెండు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కావడం ప్రతికూలాంశమని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. పోటీలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మినహా అన్నింటికీ ఓడరేవు ఉంది. దీంతో ఎగుమతి, దిగుమతులకు ఈ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయి. అన్నిటికి మించి మన రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో టెస్లాతో సంప్రదింపులు జరిపినప్పటికీ అనంతరం ఆ ప్రయత్నాలను కొనసాగించకుండా వదిలేసిందని అంటున్నారు. ముఖ్యంగా ఓడరేవు లేకపోవడం, ఎన్డీఏ కూటమిలోని రాష్ట్రాలతో మనం పోటీ పడే అవకాశం లేదనే భావన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా, దాదాపు నాలుగేండ్ల క్రితం టెస్లా కార్ల తయారీ కంపెనీ భారత్‌కు వస్తున్నట్టు సంకేతాలు వెలువడిన వెంటనే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ దాన్ని తెలంగాణకు వచ్చే విధంగా తీవ్రంగా కృషిచేశారు. నిరంతరం కంపెనీ వర్గాలతో సంప్రదింపులు జరపడమే కాకుండా ఇతర రాష్ట్రాలను తలదన్నే విధంగా తాము ప్రోత్సాహకాలు ఇస్తామని కంపెనీ వర్గాలకు సమాచారం అందించారు. దీంతో తెలంగాణ గట్టి పోటీదారుగా ఎదగడమే కాకుండా టెస్లా భారత్‌కు వస్తే అది తెలంగాణలో ఏర్పాటు ఖాయమనే ప్రచారం అప్పట్లో జరిగింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో అంచనాలు తారుమారయ్యాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సుంకాలతోపాటు పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన సహకారంపై ఆయన లేవనెత్తిన అంశాలకు ప్రధాని సానుకూలంగా స్పందించడంతో టెస్లా కంపెనీ భారత్ రాకకు మార్గం సుగమమైంది. అంతేకాదు, ఇప్పటికే తమకు అవసరమైన ఉద్యోగుల నియామకం కూడా టెస్లా చేపట్టింది. సుమారు 500మిలియన్ డాలర్లతో మొదటి దశ పెట్టుబడితో ప్లాంటు ఏర్పాటునకు టెస్లా సిద్ధమవుతున్నది.

## వాహన అమ్మకాలు అంతంతే

న్యూఢిల్లీ, మార్చి 1: వాహన ఉత్పత్తి సంస్థలకు ఫిబ్రవరి నెల షాకిచ్చింది. ధరలను పెంచుతూ వాహన ఉత్పత్తి సంస్థలు తీసుకున్న నిర్ణయంతో కొనుగోలుదారులు వెనుకంజవేశారు. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ అమ్మకాలు స్వల్పంగా పెరరగా.. హ్యుందాయ్, టాటా మోటర్స్ సేల్స్ భారీగా తగ్గాయి. వాహనాలకు డిమాండ్ పడిపోవడం వల్లనే తగ్గాయని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. మరోవైపు, మహీంద్రా, టయోటా కిర్లోస్కర్‌లు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో పన్ను సంస్కరణలు, లిక్విడిటీని పెంచడానికి తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో డిమాండ్‌ను పెంచుతాయన్న విశ్వాసాన్ని హ్యుందాయ్ మోటర్ సీఈవో తరుణ్ గార్గ్ వ్యక్తంచేశారు.


**ఫిబ్రవరిలో వాహన విక్రయాలు**

| సంస్థ | 2025 | 2024 | వృద్ధి |
|---|---|---|---|
| మారుతి | 1,99,400 | 1,97,471 | స్వల్పంగా |
| హ్యుందాయ్ | 58,727 | 60,501 | -3 |
| మహీంద్రా | 83,702 | 72,923 | 15 |
| టయోటా | 28,414 | 25,220 | 13 |
| టాటా మోటర్స్ | 79,344 | 86,406 | -8 |
| కియా ఇండియా | 25,026 | 20,200 | 24 |
| హోండా కార్స్ | 10,323 | 13,078 | -21 |



## ఎన్టీపీసీ దూకుడు

న్యూఢిల్లీ: విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 400 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. కేవలం ఈ మైలురాయికి చేరుకోవడానికి సంస్థ 335 రోజులు పట్టింది. అంతక్రితం ఏడాది కంటే 12 రోజులు ముందుగానే ఈ మైలురాయికి చేరుకోవడం విశేషం. 2023-24లో మార్చి 13న ఈ కీలక మైలురాయికి చేరుకున్నది. దేశీయంగా వినియోగిస్తున్న విద్యుత్‌లో నాలుగోవంతు సంస్థ ఉత్పత్తి చేస్తున్నదే కావడం విశేషం. ప్రస్తుతం సంస్థ 77 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగివుండగా, మరో 29.5 గిగావాట్ల విద్యుత్ యూనిట్లు నిర్మాణదశలో ఉన్నాయి.




## ఎన్ఎండీసీ ఉత్పత్తి హైజంప్

హైదరాబాద్, మార్చి 1: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఎన్ఎండీసీ ఆశాజనక పనితీరు కనబరిచింది. ఫిబ్రవరి నెలలో సంస్థ 4.62 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 3.98 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన ఖనిజంతో పోలిస్తే 18 శాతం వృద్ధిని కనబరిచినట్లు కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఖనిజాన్ని ఉత్పత్తి చేయడం కూడా కంపెనీ చరిత్రలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సంస్థ 40.49 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 40.20 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. వచ్చే ఏడాది నూతన గనులు అందుబాటులోకి వస్తుండటంతో ఖనిజ ఉత్పత్తి మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు.

# ఎంఎస్ఎంఈల మనుగడ ప్రశ్నార్థకం

- మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మారాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు


ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఎంఎస్ఎంఈలు, ఎస్ఎంఈలు మారాలని, లేదంటే రాబోయే రోజుల్లో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధ(ఏఐ) యుగంలోనూ పాత ఆలోచనలతో సంప్రదాయబద్ధంగా ముందుకెళ్తే తప్పా మనగడే ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని, ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు ఈ విషయంలో అప్రమత్తంగా, ప్రజలు కోరుకుంటున్న విధంగా కొత్తగా ఆలోచించాలని ఆయన సూచించారు. ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన 'సమ్మిట్ ఆన్ ఫ్యూచర్-రెడీ ఇండస్ట్రీ ట్రాన్స్‌ఫర్మేషన్: ఇన్నోవేటింగ్ ఫర్ గ్రోథ్ ఎఫిషియన్సీ అండ్ సెక్యూరిటీ(గ్రోథ్ ఎక్స్2025)' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..టెక్నాలజీ రోజురోజుకి కొత్త పుంతలు తొక్కుతున్నదని, ముఖ్యంగా ఏఐ అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి..అలాగే అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచన తీరు మారాలని ఆయన పేర్కొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు ఏఐ, క్వాంటమ్, మెషిన్ లెర్నింగ్ తదితర అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను చూపొంచవచ్చని, ఆ దిశగా ఆవిష్కర్తలు కొత్తగా ఆలోచించాలని కోరారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో ఇతర రాష్ట్రాలకు ధీటుగా తెలంగాణ అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నదని, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధి రేటు 17.98 శాతం కాగా జాతీయ సగటు 8 శాతం మాత్రమేనని, ఐటీ రంగంలో తెలంగాణ సత్తా ఏంటో చెప్పడానికి ఇదే నిదర్శనమని మంత్రి అన్నారు.

### 6 నుంచి చర్లపల్లిలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో

ఈ నెల 6 నుంచి 8 వరకు చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో-2025 ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో 106 స్టాల్స్‌ను నెలకొల్పుతున్నట్లు, వాటిలో వివిధ పరిశ్రమలు తయారు చేస్తున్న ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించనున్నట్లు వారు చెప్పారు.




## అల్ట్రాటెక్‌లో కేశోరాం విలీనం

పాలకుర్తి, మార్చి 1: ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌లో బీకే బిర్లా గ్రూపునకు చెందిన కేశోరాం సిమెంట్ విలీనమయ్యాయి. ఇందుకు సంబంధించి పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వద్ద ఉన్న యూనిట్‌లో ఇందుకు సంబంధించి అధికారిక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 ఏండ్ల క్రితం ఉత్తర తెలంగాణలోని బసంత్ నగర్‌లో బీకే బిర్లా సిమెంట్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఆతర్వాతి క్రమంలో ఇక్కడే కేశోరాం సిమెంట్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం ఈ కేశోరాం సిమెంట్‌ను ఆదిత్యా బిర్లా గ్రూపు కొనుగోలు చేయడంతో ఇక నుంచి ఈ ప్లాంట్‌లో అల్ట్రాటెక్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శనివారం ఈ యూనిట్‌లో కార్మికులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేసి, అధికారికంగా అల్ట్రాటెక్ లోగోను ఆవిష్కరించారు.

## నెల రోజుల పాటు డెమో రైళ్లు రద్దు

- ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో..

వినాయక్‌నగర్, మార్చి 1 : కాచిగూడ-నిజామాబాద్ మధ్య నడిచే డెమో రైళ్లను నెల రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శనివారం ప్రకటించింది. నిజామాబాద్-కాచిగూడ సెక్షన్‌లో ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో కాచిగూడ-నిజామాబాద్ (77601/77602) రైళ్లు ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

## ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడి మృతి

ఎడపల్లి, మార్చి 1 : జాన్కంపేట్ శివారులో ఓ యువకుడు శనివారం ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందాడు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. నవీపేట్ మండలం మిట్టపల్లికి చెందిన తెడ్డు శ్రీకాంత్ (23) జాన్కంపేట వద్ద.. నవీపేట్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌పై లిఫ్ట్ అడిగి ఎక్కాడు. రైల్వే ట్రాక్ దాటిన తర్వాత తెడ్డు శ్రీకాంత్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.


నిజామాబాద్ జిల్లాలోని డీఎస్సీ -2008 బ్యాచ్‌కు సంబంధించిన పోస్టింగ్ ఆర్డర్లను అర్హులకు డీఈవో అశోక్ తన చాంబర్‌లో శనివారం అందజేశారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు 74 మంది అభ్యర్థులకు ఆర్డర్ కాపీలు అందజేసినట్లు డీఈవో తెలిపారు.

– ఖలీల్‌వాడి, మార్చి 1

## పెరుగుతున్న బైకు చోరీలు

- చోరీలు అరికట్టేందుకు రంగంలోకి దిగిన ప్రత్యేక టీం

నవీపేట, మార్చి 1: మండల కేంద్రంలో కొన్ని రోజుల నుంచి వరుసగా బైకులు చోరీకి గురవుతున్నాయి. దీంతో జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు ప్రత్యేక టీం రంగంలోకి దిగింది. మండల కేంద్రంలో ప్రధాన వీధులు, రోడ్ల కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను ఆ టీం రోజూ పరిశీలించనున్నది. మండల కేంద్రంలో ప్రతి శనివారం మేకల సంత, శుక్రవారం కూరగాయల సంత నిర్వహిస్తుంటారు. సంతకు దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు వస్తుంటారు. ఇదే అదనుగా భావించిన దొంగలు బైకులతోపాటు వ్యాన్‌లను సైతం దొంగిలించుకొని పారిపోతున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వరుస బైక్ చోరీలను సీరియస్‌గా తీసుకున్న జిల్లా పోలీస్ యంత్రాంగం దుండగులను ఎలాగైనా పట్టుకునేందుకు నూతన టెక్నాలజీతో రంగంలోకి దిగినట్లు సీఐ శ్రీనివాస్ చెప్పారు. త్వరలో దొంగలను పట్టుకొని, మీడియా ముందుకు తీసుకువస్తామని సీఐ ధీమావ్యక్తం చేశారు.

### పనిచేయని సీసీ కెమెరాలు

గతంలో స్థానిక మార్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో మండల కేంద్రంలో దొంగతనాల సంఖ్య చాలా వరకు తగ్గిందని స్థానికులు అంటున్నారు. ఇటీవల కాలంలో అవి పనిచేయకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాల నిర్వహణ చూసేందుకు మర్చంట్స్ అసోసియేషన్ కృషి చేస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలో దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు రాత్రివేళ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఘరానా దొంగ అరెస్టు

- తాళం వేసిన ఇండ్లే టార్గెట్ చేసే నేరస్తుడు
- కర్ణాటక, హైదరాబాద్, నిజామాబాద్‌లో 85 కేసులు
- నాచారం పోలీస్‌స్టేషన్‌లో పీడీ యాక్ట్ నమోదు
- 19 తులాల నగలు, రూ.3.20 లక్షల నగదు, అరకిలో వెండి స్వాధీనం
- నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటెడ్డి వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

వినాయక్‌నగర్, మార్చి 1 : ద్విచక్రవాహనంపై తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసుకొని, రాత్రి,పగలు అనే తేడా లేకుండా చోరీలకు పాల్పడే అంతరాష్ట్ర దొంగను నిజామాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన సయ్యద్ అమీద్ హైదరాబాద్‌లో నివాసముంటూ అక్రమ సంపాదనకు అలవాటు పడి, వరుస చోరీలు చేయడమే తన ప్రవృత్తిగా మార్చుకున్నాడు. సదరు నిందితుడు ఫిబ్రవరి 26న ద్విచక్రవాహనంపై నిజామాబాద్ చేరుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియాలోని ఏకశిలానగర్, గంగస్థాన్ ఫేస్-3లో తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీకి పాల్పడి, బంగారు నగలు, నగదును అపహరించాడు. అనంతరం మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనిఆర్టీసీ కాలనీలో సైతం మరో ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సంబంధింత ఠాణాల్లో కేసులు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు సౌత్, నార్త్ సీఐల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం రూరల్ పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా.. బ్లూ కలర్ హోండా యాక్టివాపై అటువైపుగా వచ్చిన ఓ అనుమానితుడిని సిబ్బంది తనిఖీ చేశారు. సదరు అనుమానితుడి వాహనం డిక్కీలో నగదు, బంగారు నగలు, వెండితో పాటు ఇనుప సుత్తి, స్క్రూడ్రైవర్‌ను గుర్తించారు. అనుమానితుడు సయ్యద్ అమీద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా... ఫిబ్రవరి 26న తాను మూడిండ్లలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని ఏసీపీ వెల్లడించారు.

### 15 ఏండ్లుగా చోరీలు..

సదరు నిందితుడు 15 ఏండ్లుగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందని ఏసీపీ తెలిపారు. సయ్యద్ అమీద్‌పై ఇప్పటివరకు కర్ణాటక రాష్ట్రంతోపాటు హైదరాబాద్, చందానగర్, సరూర్ నగర్, నిజామాబాద్ జిల్లాలోని బోధన్, రెంజల్, ఎడపల్లి పోలీస్‌స్టేషన్లలో సుమారు 85 కేసులు నమోదై ఉన్నాయని వెల్లడించారు. 2018లో సదరు నేరస్తుడిపై నాచారం పోలీస్‌స్టేషన్‌లో పీడీ యాక్ట్ కేసు సైతం నమోదైనట్లు తెలిపారు. 48 గంటల వ్యవధిలో దొంగను పట్టుకున్న సీఐలు, ఎస్సైలతో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు. వారికి రివార్డులను సైతం ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో సౌత్, నార్త్ సీఐలు సురేశ్, శ్రీనివాస్, రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్, మాక్లూర్ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

## రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

కంఠేశ్వర్, మార్చి 1 : రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్ సైక్లింగ్ పోటీలకు జిల్లా జట్టును కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో శనివారం ఎంపిక చేశారు. సైక్లింగ్ సంఘం జిల్లా కార్యదర్శి విజయ్‌కాంత్‌రావు ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టు హైదరాబాద్‌లో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జట్టుకు కోచ్‌గా ఆర్.నరేశ్‌కుమార్, మేనేజర్‌గా గడ్డం రవి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్ సుబేదార్, టి.సూర్యప్రకాశ్, ప్రతినిధులు గడ్డం రవి, దుర్గామల్లేశ్, శ్రీధర్‌రావు, ఆర్.నరేశ్ పాల్గొన్నారు.

## అధ్వానం.. పట్టణ ప్రకృతివనం


ఆర్యనగర్‌లోని పట్టణ ప్రకృతివనం నాలాలో పేరుకుపోయిన చెత్త, పట్టణ ప్రకృతివనంలో ఎండిపోయిన కట్టెలు

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పట్టణ ప్రకృతివనాలు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆదరణ కోల్పోయి అధ్వానంగా మారుతున్నాయి. జిల్లాకేంద్రలోని ఆర్యనగర్‌లో ఉన్న పట్టణ ప్రకృతి వనం చెత్తా చెదారం, ఎండిన కట్టెలతో దర్శనమిస్తున్నది. చుట్టుపక్కల ప్రాంతాల వారు చెత్తను పట్టణ ప్రకృతివనంలోనే వేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## జాతీయస్థాయి క్రీడాకారిణికి సన్మానం


మహిమను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

సారంగాపూర్, మార్చి 1 : హర్యానా రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభను కనబర్చి, సిల్వర్ మెడల్ సాధించిన బగ్గలి మహిమతోపాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన పీఈటీ కృష్ణంరాజును గ్రామపెద్దలు శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మహిమ జాతీయస్థాయిలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్, నగేశ్, వెంకటేశ్, అశోక్ పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

వినాయక్‌నగర్, మార్చి 1 : నిజామాబాద్ నగర శివారులో గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఓ కంపెనీకి చెందిన గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న లారీ.. సారంగాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో లారీ పక్కన ఇతర వాహనాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్‌తోపాటు క్లీనర్‌కు గాయాలయ్యాయి. లారీలో ఉన్న సిలిండర్లను మరో వాహనంలో అక్కడి నుంచి తరలించారు.

## తాళం వేసిన రెండ్లిండ్లలో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

మోర్తాడ్, మార్చి 1: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి తాళాలు వేసి ఉన్న రెండిండ్లలో చోరీ జరిగింది. దొంగలు ఇండ్ల తాళాలు పగులగొట్టి బీరువాల్లో ఉన్న నగదు, బంగారాన్ని చోరీ చేశారు. మినుముల గంగాధర్ ఇంట్లో రూ.5 లక్షలు, అరతులం బంగారం, వాంకార్ శ్రీనివాస్ ఇంట్లో రూ.20 వేల నగదు, అర తులం బంగారం చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.